బాల్యం.. పుస్తకాల మోత భారం

- చిన్నతనంలోనే వెన్ను, కండరాలపై ప్రభావం
- అమలుకాని ఎన్‌సీఈఆర్‌టీ సూచనలు
- ఏలూరులో పాఠశాల విద్యార్థులు 30,799 మంది



పుస్తకాల బ్యాగులతో పాఠశాలలకు వెళుతున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బాల్యం చదువును మోస్తోంది. ఉన్నత స్థానాలకు చేరాల్సిన భవిష్యత్ తరాన్ని పుస్తకాల మోత మానసికంగా, శారీరకంగా అణచివేస్తోంది. రాష్ట్రంలో ముఖ్యంగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు పాఠశాల విద్య శిక్షణలా కాకుండా శిక్షలా పరిణమిస్తోంది. పుస్తకాల మోతతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారన్నది వైద్యుల మాట. ఈ పరిస్థితిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) చేసిన సూచనలు ఎక్కడా అమలు కావడం లేదు. ఏటా పుస్తకాల సంచిలో బరువు పెరగడమే తప్ప తగ్గడం లేదు. విద్యార్థి తన శరీర బరువులో రెండో వంతు మోయడం అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో పుస్తకాల సంచి పరిమాణాన్ని తగ్గిస్తూ రాష్ట్రాలకు కేంద్రం సూచనలు చేసింది.

రెండు, మూడు పుస్తకాలే ఉండాలి

వాస్తవానికి ఒకటి, రెండు తరగతులకు రెండు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం), మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కేవలం మూడు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం, ఎన్విరాన్మెంట్) ఉండాలి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పిల్లలపై పుస్తకాల ఒత్తిడి తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తోంది. కానీ ప్రస్తుత విద్యా విధానంలో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు 8 పుస్తకాలు, తరువాత తరగతి పెరిగే కొద్దీ అధిక నోట్ బుక్స్ మోయాల్సి వస్తోంది. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకైతే ఈ సంఖ్య దాదాపు రెట్టింపు ఉంటోంది.

అనారోగ్య సమస్యలు

విద్యార్థులు తమ స్థాయికి మించి బరువు మోస్తుండడంతో పలు రకాల అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెన్ను, కండరాల నొప్పులకు దారితీస్తుందని, చదువులపై ఏకాగ్రత తగ్గుతుందని చెబుతున్నారు. ఈ ప్రభావం విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తి పెంపొందడానికి అడ్డంకిగా మారుతుందని, మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

స్కూల్ బ్యాగ్‌ల మోతతో ఇబ్బందులు

స్కూల్ బ్యాగ్ బరువుపై జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) నిర్వహించిన సర్వేలో నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను పరిశీలించారు. సాధారణంగా వీరి శరీరబరువు 18 కేజీల నుంచి 22 కేజీల వరకు ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో 10 నుంచి 12 కేజీలు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 14 నుంచి 18 కేజీల పుస్తకాల మోత ఉంటుంది. 8 నుంచి 10వ తరగతి విద్యార్థుల శరీర బరువు 40 నుంచి 50 కేజీల వరకు ఉంటే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా భావించాలి. వారు బడికి వెళ్లేందుకు 20 నుంచి 25 కేజీల సంచిని మోయాల్సి వస్తుంది. పాఠ్యపుస్తకాలకు తోడు క్యారేజీ, తాగు నీటి బాటిల్స్ తదితరాలు వీటికి అదనం. ప్రభుత్వ బడులకన్నా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల మోత ఎక్కువగా ఉంటోందని శిక్షణ మండలి పేర్కొంది. రాష్ట్ర సిలబస్‌తో పాటు పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్, ఐఐటీ, సీబీఎస్ఈ ఇలా వివిధ రకాల పుస్తకాలను మోయాల్సి రావడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.

జీఓ 22 ఇలా చెబుతోంది

విద్యార్థుల స్కూల్ బ్యాగుల బరువులకు సంబంధించి 2017లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 22వ నెంబర్ జీఓ విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం ఏ తరగతి విద్యార్థి ఎంత బరువు బ్యాగు వినియోగించాలో వివరించింది. ఈ మేరకు 1-2 తరగతుల విద్యార్థులు 1.50 కిలోల బరువు, 3-5 తరగతుల విద్యార్థులు 2 నుంచి 3 కేజీల బరువు బ్యాగు తీసుకువెళ్ళవచ్చు. అలాగే 6-7 తరగతుల విద్యార్థులు 4 కేజీల బ్యాగు, 8-9 తరగతుల విద్యార్థులు 4 నుంచి 5 కేజీల బ్యాగు, 10వ తరగతి విద్యార్థులు 5 కేజీల వరకు బరువున్న బ్యాగును తీసుకువెళ్లాలి.

131 పాఠశాలలు, 30,799 మంది విద్యార్థులు

ఏలూరు నియోజకవర్గంలో మొత్తం 131 పాఠశాలల్లో 30799 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 65 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు 8295 మంది ఉన్నారు. 66 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు 22504 మంది ఉన్నారు.

నిబంధనలు అమలు చేయాలి



విద్యార్థులకు పుస్తకాల మోత లేకుండా ఎన్‌సీఈఆర్‌టీ నిబంధనలు అమలు చేయాలి. ముఖ్యంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పుస్తకాల వ్యాపారం కారణంగానే విద్యార్థులకు మోత బరువు పెరుగుతుంది. ఈ అంశాన్ని విద్యాశాఖాధికారులు తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలి. నిబంధనలు అమలు చేయని పక్షంలో విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

లేబర్ కోడ్‌లను రద్దుచేసే వరకు పోరాటం



ఐక్యతను చాటుతున్న ఇఫ్టూ నాయకులు

ఏలూరు (టూటౌన్): దేశంలో మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికవర్గం సమరశీల పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఇఫ్టూ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ సమావేశం ఏలూరు జిల్లా ఆఫీసులో సోమవారం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ సర్కార్ సరళీకరణ విధానంలో రాష్ట్రంలో కూటమి సర్కార్ 10 గంటల పని దినాలను ప్రవేశపెట్టిందని, దీనిపై ఉద్యమించాలన్నారు. ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో ఇఫ్టూ రాష్ట్ర స్థాయి క్లాసులు ఏలూరులో నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా ఆఫీస్ బేరర్స్, కమిటీ సభ్యులు ఎస్ రామ్మోహన్, దాన వరప్రసాద్, యర్రా శ్రీనివాసరావు, ఈ.గ్రీష్మ కుమార్, గడసాల రాంబాబు, ముంగం అప్పారావు, దూళ్ల వీరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

దెందులూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై చర్యలు తీసుకోవాలని ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అధికారులను ఆదేశించారు. సోమవారం ఏలూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామాల వారీగా సమస్యలపై సమీక్షించారు. డిప్యూటీ తహసీల్దార్లు నాగమణి, ప్రియదర్శిని అధికారులు వీఆర్‌ఓలు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

భీమడోలు: విద్యార్థి దశ నుంచి ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీస్ శాఖ శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు శక్తి యాప్ వలన కలిగే ప్రయోజనాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి, పుస్తకాలను చదవాలన్నారు.

చదువు పట్ల శ్రద్ధ వహించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జీవితంలో ఎదుగుదలకు ఇంజినీరింగ్ ప్రథమ మెట్టని ప్రతి విద్యార్థీ తలదించి 20 సంవత్సరాలు చదివితే 80 సంవత్సరాల పాటు జీవితం సాఫీగా సాగేలాగా ఉంటుందని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు తమ ఆశయ సాధన కోసం చదువు పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కళాశాల ప్రతినిధులు ఎస్పీని జ్ఞాపికతో సత్కరించారు. కాలేజీ యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

ద్వారకాతిరుమల: విద్యార్థుల చదువుకు దాతలు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని శ్రీవారి దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన కందాడై శ్రీనివాసాచారి చిన వెంకన్న దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 285 మంది విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్‌లు, బ్యాగ్‌లు, బెల్టులు కొనుగోలు నిమిత్తం రూ. 5.44 లక్షలను అందించారు. అలాగే ఉండ్రాజవరంనకు చెందిన శ్రీ బాలబాలాజీ శ్రీనివాసా పౌల్ట్రీస్ నిర్వాహకులు మల్లెన రంగారావు, మల్లెన శేషగిరిరావు పాఠ్య పుస్తకాల కొనుగోలుకు రూ.1,65,118 అందజేశారు. ఈ నగదుతో కొనుగోలు చేసిన యూనిఫామ్‌లు, బ్యాగ్‌లు, బెల్టులు, పాఠ్య పుస్తకాలను ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు సూచనల మేరకు, ఈఓ సత్యన్నారాయణ మూర్తి స్థానిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అందజేశారు.

అనాథ బాలలకు ఆధార్ నమోదు



అనాథ బాలలకు ఆధార్ నమోదు చేయిస్తున్న రత్నప్రసాద్ తదితరులు

ఏలూరు (టూటౌన్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అనాథ బాలలు 27 మందిని గుర్తించి, వారికి ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టినట్టు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. వీరిలో 16 మంది బాలలకు ఇంతకు ముందు ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తయిందని, హనుమాన్ జంక్షన్‌లోని ఆశాజ్యోతి ఆధ్వర్యంలో ఆశ్రయం పొందుతున్న 11 మంది విభిన్న ప్రతిభావంతులకు సత్రంపాడు పంచాయతీలో ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టినట్టు తెలిపారు. గుర్తింపు కార్డులేని అనాథ బాలలు ఎవరైనా ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీఓ సూర్య చక్రవేణి, ఆశాజ్యోతి విభిన్న ప్రతిభావంతుల ఆశ్రమం మేనేజర్ మాధవీ లత, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

50 ఎకరాల్లో పట్టు పురుగుల పెంపకం

దెందులూరు: మండలంలోని మెట్ట గ్రామాల్లో 50 ఎకరాల్లో పట్టు పురుగుల పెంపకం సాగు చేస్తున్నారని హార్టికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ టి.రత్తయ్య అన్నారు. సోమవారం రామారావుగూడెంలోని పట్టుపురుగుల పెంపక షెడ్లను ఆయన పరిశీలించారు. ఒక్కో రైతుకు షెడ్డు బట్టీలు, ప్లాంటేషన్ మెస్‌లు కలిపి రూ.5 లక్షలు యూనిట్‌గా రుణం మంజూరు చేస్తారని రత్తయ్య తెలిపారు. ఎస్సీ లబ్ధిదారులకు 90 శాతం సబ్సిడీ మంజూరు చేస్తున్నామన్నారు. సొంత భూమి కలిగి ఉన్న రైతులు మెట్ట గ్రామాల్లో పట్టు పురుగుల పెంపకం చేస్తారన్నారు. దీనికి తోడు జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.3 లక్షలకు పైగా సబ్సిడీ ఇవ్వడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

అలరించిన 'మట్టి మనిషి'



'మట్టి మనిషి' నాటకంలోని కీలక సన్నివేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హేలాపురి కళాపరిషత్, అభినయ నృత్య భారతి, ఆంధ్రప్రదేశ్ సకల కళాకారుల సంక్షేమ సంఘం, తదితర సంస్థల సహకారంతో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, కళాతోరణం కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలో ప్రదర్శించిన మట్టి మనిషి నాటకం ప్రేక్షలకు ఆద్యంతం అలరించింది. స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి రచనల్లో తలమానికంగా నిలిచిన నవల మట్టి మనిషి నవలను ప్రఖ్యాత కథా, నాటక రచయిత పల్లూరు శివప్రసాద్ నాటకంగా మలిచి, ప్రసిద్ధ రంగస్థల దర్శకుడు ఎస్ఎం బాషా దర్శకత్వంలో దాదాపు నాలుగు గంటల పాటు ఏకదాటిన ప్రదర్శించారు. నటీనటుల నటనా పటిమ, దర్శకుని ప్రతిభ జోడించి ప్రదర్శిస్తే ఈ రోజుల్లో కూడా నాటకాలు ప్రేక్షకాదరణ పొందుతాయని ఈ ప్రదర్శన నిరూపించింది. మాస్టర్ పీస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్ కాలమ్‌లో ప్రస్తావించిన నన్నయ్య నాటి నుంచి నేటి వరకు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో మట్టి మనిషి నవల 13వ రచనగా నిలిచింది. భూమికి – రైతుకు ఉన్న పేగు బంధాన్ని ఈ నాటకంలో మహోన్నతంగా చిత్రీకరించారు. ఆ బంధం తెగిపోతే, ఉత్పత్తి సాధనం అయిన భూమి వ్యాపార సాధనంగా మారిపోతే సంభవించే విపరిణామాలను, సమస్త విలువల్నీ దెబ్బతీసే వ్యవస్థ నగ్నరూపాన్ని తన నవలలో కళ్లకు కట్టారు రచయిత్రి. ఫలితంగా పతనమయ్యే మానవ సమాజంలో తలెత్తేది మోసం, హింసాప్రవృత్తి అని చాటారు.

లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలి

భీమడోలు: పంచాయతీ పరిధిలోని పెదలింగంపాడులో లో ఓల్టేజ్ విద్యుత్ సమస్య వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను తక్షణమే పరిష్కారించాలంటూ భీమడోలు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఏలూరులో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన కలెక్టర్ వెట్రిసెల్వికి లిఖిత పూర్వక ఫిర్యాదు అందించారు. పెదలింగంపాడులో పగలు, రాత్రి వేళల్లో లో ఓల్టేజ్ సమస్యతో ఇంట్లో ఫ్యాన్లు తిరగడం లేదని, పిల్లలు, వృద్ధులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

స్మార్ట్ మీటర్ల రద్దుకు సంతకాల సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సంతకాల సేకరణ చేస్తామని, నేటి నుంచి ప్రజా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలకు మద్దతును ప్రకటిస్తున్నామని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు గ్రామంలో ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పల్లెం ప్రసాద్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కూటమి నేతలు ఎన్నికల ప్రచార సభల్లో విద్యుత్ భారం పడకుండా చూస్తామని, చార్జీలు పెంచబోమని చెప్పిన విషయం మరిచిపోవడం దారుణమని అన్నారు. ఏడాది కాలంలో రూ. 15.485 కోట్లు సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపిందని వివరించారు. గతంలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపు ఇచ్చిన కూటమి నేతలు నేడు మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వడం సరికాదని అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో దుకాణాలు చిన్న పరిశ్రమలకు పది రెట్లు విద్యుత్ చార్జీలు పెరిగాయని తెలిపారు. మీటరు ఖర్చులను రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వరకు దశలవారీగా వినియోగదారులపై మోపటం దారుణం మని అనానరు. స్మార్ట్ మీటర్లు సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత మీటర్లను కొనసాగిస్తూ పాత రీడింగ్ పద్ధతిని అమలు చేయాలని కోరారు. సూపర్ సిక్స్ హామీలు ఏడాదైనా అమలు చేయకుండా పబ్బం గడుపుతున్న తీరును ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు.

గురుకులంలో నూతన భవనం నిర్మించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏలూరు (టూటౌన్): భీమడోలు మండలం పోలసానపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కూలిపోయిన గదులు స్థానంలో కొత్త గదులు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గదులు లేకపోవడంతో విద్యార్థులు డార్మెంటరీలోనే విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. తాత్కాలికంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసి విద్యా బోధన చేయాలని, డార్మెంటరీలో ఉన్న రిపేర్లు కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మే నెలలో తర్వాత గదులు పడిపోతే పాఠశాల ప్రారంభమయ్యేంత వరకు పట్టించుకోలేదని మండిపడ్డారు. ఏలూరు ఎస్సీ బాయ్స్ కాలేజీ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న హాస్టల్‌లో విద్యార్థులు మత్తు పదార్థాలు అలవాటు పడ్డారని, ఎస్ఎఫ్ఐ గతవారం సాక్ష్యాలతో సహా మీడియాకు అందజేసిందని తెలిపారు. అయినా అధికారులు ఇప్పటికీ స్పందించలేదని పేర్కొన్నారు. హాస్టల్‌లో మత్తు పదార్థాలు అలవాటు పడడానికి సహకరించిన హాస్టల్ వార్డెన్ పైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజూ కళాశాలకు వెళ్లకుండా దాదాపు 20 మంది వరకు హాస్టల్లోనే ఉంటున్నారని తెలిపారు. ఆశ్రం కాలేజీకి చెందిన ఒక ఎంబీబీఎస్ స్టూడెంట్స్‌కి ఒక రూమ్ ఎందుకు అంటూ ప్రశ్నించారు. సాయంత్రం పూట పోలీసు వారిని నిఘా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, అధ్యక్షుడు బి.మనోజ్, నగర్ కమిటీ సభ్యులు సూర్యభాను తదితరులు పాల్గొన్నారు.

అంకాలంపాడు వైఎస్సార్ సీపీ కమిటీ ఎన్నిక



వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సభ్యులు

కామవరపుకోట: అంకాలంపాడు గ్రామ పంచాయతీ వైఎస్సార్ సీపీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ పరిశీలకులు, కామవరపుకోట సొసైటీ మాజీ అధ్యక్షుడు సాయిన కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయంకుల సత్యనారాయణ నూతన కమిటీని ప్రకటించారు. అంకాలంపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కిలారు గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా కొత్తపల్లి వెంకటరత్నం, దొప్పసాని శ్రీను, పైడిమర్ల ఏసురెడ్డి, బత్తుల నాగేశ్వరరావు, కొలుకులూరి వెంకటేషు, కార్యదర్శులుగా వంశీకృష్ణ, బడిపెట్ల ప్రతాప్, కలపాల కిరణ్, దూదిపాల మంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయంకుల, కనకరాజు మాట్లాడుతూ వచ్చే ఏడాది జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా ఎరగవేసేలా నూతన కమిటీ కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏలూరు పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కీసరి సరితా విజయ్ భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీహరిరెడ్డి, ఎంపీటీసీ బీఎస్ఎన్, రఘుపతి రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేపై నిర్లక్ష్యం వద్దు

దెందులూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే పట్ల నిర్లక్ష్యం వహించొద్దని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ అన్నారు. సోమవారం ఫీవర్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులు ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి కారణంగా జ్వరాలతో పాటు ఇతర అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. అనారోగ్య లక్షణాలు గుర్తిస్తే సమీప ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఫీవర్ సంక్రమిత వ్యాధులపై చేస్తున్న సర్వేలో సిబ్బందికి వాస్తవాలు తెలియజేయాలని ఆయన కోరారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	28	బీన్లచిక్కుడు	120
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	64	కంద	00
కాకర కాయలు	40	బీట్‌రూట్	40
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	26	అల్లం	88
క్యారెట్	40-45	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	48	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	25
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

హర్ ఘర్ తిరంగాపై విస్తృత ప్రచారం

దెందులూరు: స్వాతంత్ర్య ఉద్యమం పట్ల దేశ భక్తి భావంపై ఈ నెల 15 వరకు మండలంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని తహసీల్దార్ బి.సుమతి అధికారులను ఆదేశించారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆజాదిక అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామ గ్రామాన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ర్యాలీలు, రంగోలి పోటీలు దేశభక్తిని పెంపొందించే ఫొటో ఎగ్జిబిషన్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా అవగాహన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అన్ని శాఖల అధికారులు ఉద్యోగులతో సమన్వయం చేసుకొని నూరు శాతం లక్ష్యాలు సాధించాలన్నారు.

అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలి



ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

చింతలపూడి: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన నిర్వహించారు. అనంతరం పనిచేయని ఫోన్‌లను ఇన్‌చార్జి సీడీపీఓకి అందజేశారు. యూనియన్ జిల్లా నాయకులు టి మాణిక్యం, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సరోజినీ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణ ట్రాకర్, బాల సంజీవని, యాప్ అమలుకు సపోర్ట్ చేయడం లేదన్నారు. లబ్ధిదారులకు ఫోటో క్యాప్చర్ ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధనను అమలు చేయటానికి అంగన్‌వాడీ వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అంగన్ వాడీ సెంటర్లకు సరుకులు అన్నీ ఒకసారిగా రావడం లేదని, నెట్ సిగ్నల్ లేకపోవడం వలన, సర్వర్లు పని చేయకపోవడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్ గా మార్పు చేయాలని, ఎఫ్‌ఆర్ఎస్, ఇన్, అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్లు, 5జీ నెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.